

ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో విశాల్, రవికిరణ్

కాంగ్రెస్ యువనేతలకు ఎమ్మెల్యే అభినందన

ఖైరతాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తూనే ప్రజల సమస్యలపై నాయకులు స్పందించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఇటీవల యువజన కాంగ్రెస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.విశాల్‌బాబు, ఖైరతాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రవికిరణ్ శనివారం దానం నాగేందర్‌ను కలవగా వారిని సత్కరించి అభినందించారు. పార్టీలో కష్టపడి పని చేసేవారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే దానం అన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రథమ పటాలం కమాండెంట్ పి.మురళీకృష్ణ

పోలీస్‌లైన్ ప్రథమ పటాలంలో కంటి వైద్యశిబిరం

యూసుఫ్‌గూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ పోలీస్‌లైన్ ప్రథమ పటాలంలో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చల్లా కంటి సంరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కమాండెంట్ పి.మురళీకృష్ణ ప్రారంభించారు. వైద్య శిబిరంలో పటాలంలోని పోలీసులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు వై.రాంబాబు, కేవీ రవిచంద్ర, కేవీపీ ప్రసాద్, కె.అప్పురాయ్, ఏ.నర్సింహ, ఆర్‌ఐలు సురేష్, ధర్మారావు, సాంబయ్య, శంకర్, రాజేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి కంటి సంరక్షణే లక్ష్యం

● డాక్టర్ ప్రశాంత్‌గార్గ్

బంజారాహిల్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ (ఎల్వీపీఈఐ), ఫెర్నాండేజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 8వ ఈక్విటబుల్ హెల్త్‌కేర్ యాక్సెస్ కన్సార్టియం (ఈహెచ్‌ఏసీ) సభ్యుల సమావేశాన్ని ఎల్వీ ప్రసాద్ క్యాంపస్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ చైర్ డాక్టర్ ప్రశాంత్‌గార్గ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి కంటి సంరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. మూడు దశాబ్దాలుగా 38 మిలియన్లకు పైగా రోగులకు సేవలు అందించినట్లు చెప్పారు. ఈక్విటబుల్ హెల్త్‌కేర్ యాక్సెస్ కన్సార్టియం ద్వారా నైపుణ్యాన్ని వర్ధమాన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థాపకులతో పంచుకోవడంతో పాటు భవిష్యత్తు సవాళ్లను అధిగమిస్తామన్నారు. కార్యక్రమంలో ఫెర్నాండేజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు మొక్కలు, పుస్తకాల పంపిణీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల సందర్భంగా హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధికారులకు, ఉద్యోగులకు మొక్కలు, పుస్తకాలను అందజేశారు. శనివారం అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కమిషనర్ కోట శ్రీవాత్సవ, కార్యదర్శి చంద్రయ్య, చీఫ్ ఇంజనీర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు పుస్తకాలను అందజేస్తున్న కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

అమ్మవారికి పూజలు



ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

- యూసుఫ్‌గూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మంద కృష్ణమాదిగ

పంజాగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చేయూత పెన్షన్ దారుల సమస్యలపై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ.. ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు చేసుకుంటుందని, అయితే దివ్యాంగులు మాత్రం ఆవేదనతో కూడిన సమావేశం నిర్వహించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వికలాంగుల చట్టాన్ని రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఓ ఐఏఎస్ అధికారిని దివ్యాంగులను అవమానించినా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఏ విధంగా పోరాడామో, అదే విధంగా దివ్యాంగుల హక్కుల కోసం పోరాటం చేస్తామని మంద కృష్ణ అన్నారు. ఈ సమావేశంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకురాలు బాలలత తదితరులు పాల్గొన్నారు.

నాలాను ఆక్రమించిన వ్యక్తిపై కేసు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాలాను ఆక్రమించి పెట్స్ పెంచుతున్న వ్యక్తిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్లారెడ్డిగూడకు చెందిన మహ్మద్ మెహరాజ్‌ఖాన్ అలియాస్ తన్నూఖాన్ ప్రభుత్వ నాలాను ఆక్రమించిన వేసిన షెడ్డులో గొర్రెలు, పావురాలు, కోళ్లు, పిచ్చుకలు, బాతులను పెంచుతున్నాడు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు అందడంతో జీహెచ్‌ఎంసీ వెటర్నరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చక్రధర్‌తో కలిసి వెళ్లి పోలీసులు పరిశీలించారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో అక్కడున్న 9 పొట్టేళ్లు, 6 కోళ్లు, 26 పావురాలు, 5 బాతులు, 19 పిచ్చుకలను స్వాధీనం చేసుకుని తన్నూఖాన్‌పై కేసు నమోదు చేశారు.

ఆరోగ్య కేంద్రంలో అందని వైద్యం

● ఆరు నెలలుగా అందుబాటులో లేని వైద్యుడు
● ఒకే ఒక్క నర్సు పర్యవేక్షణలోనే చికిత్సలు
● మందులు సైతం అందుబాటులో లేని వైనం
● ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న పేదలు
● ఇదీ షౌకత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి



షౌకత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బంజారాహిల్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని షౌకత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు తిష్ట వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో అనారోగ్యం బారిన పడినవారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ జ్వరాలతో పాటు పలు అనారోగ్య సమస్యలతో ఈ ఆస్పత్రికి నిత్యం 50-60 మంది పేషెంట్లు వస్తుంటారు. అలాగే గర్భిణులు, చిన్నారులకు టీకాల కోసం వస్తుంటారు. గతంలో వీరందరికీ ఇక్కడ ఓ వైద్యుడు సేవలందించే వారు. అయితే ఆయన బదిలీ కావడంతో ఆరు నెలలుగా మరో వైద్యుడు అందుబాటులో లేకుండా పోయారు. డాక్టర్ పోస్టు భర్తీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మందులు సైతం అరకొరగా ఉండటంతో రోగులు అవస్థలు పడుతున్నారు.

బదిలీపై వెళ్లిన సిబ్బంది

ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం ఓ డాక్టర్, ఆరుగురు నర్సులు సేవలందించేవారు. అయితే బదిలీలపై డాక్టర్‌తో పాటు ఐదుగురు సిబ్బంది వెళ్లిపోగా కేవలం ఒక్క నర్సు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఇక్కడ సిబ్బందిని, వైద్యుడిని బదిలీ చేసిన అధికారులు తిరిగి వాటిని భర్తీ చేయడంలో నిర్లక్ష్య వైఖరి కనబరుస్తున్నారు. గతవారం బస్తీలో తల్లి, కుమారుడికి తీవ్ర జ్వరం రాగా, డెంగ్యూ అని నిర్ధారణ అయింది. అయితే ఆరోగ్య కేంద్రంలో సేవలు అందించే వారు లేకపోవడంతో సదరు రోగులు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా చికిత్స కోసం రూ.50 వేల ఖర్చు అయింది. 15 రోజుల క్రితం ఆరోగ్య కేంద్రానికి ఓ గర్భిణి చెకప్ నిమిత్తం వచ్చి స్పృహ తప్పి పడిపోయింది. ఆమెకు చికిత్స చేసేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సంజీవరెడ్డినగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జ్వరం మందులూ కరువే

కనీసం జ్వరం ట్యాబ్లెట్లు సైతం అందుబాటులో లేని దుస్థితిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. బీపీ, డయాబెటిస్ మందులు కూడా లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య తగ్గుముఖం పడుతోంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తనిఖీ చేశారు. మందులు, సిబ్బంది కొరత విషయమై ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు అప్పటికప్పుడు కొన్ని మందులు పంపించారు. ఇప్పుడు అవి అయిపోయే పరిస్థితి నెలకొంది. పరిస్థితి ఇలాగే ఉంటే ఆరోగ్య కేంద్రాన్ని మూసివేయాల్సి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతోనే..



ప్రభుత్వ ఆస్పత్రులు, పేద, మధ్యతరగతి రోగులంటే వైద్యశాఖ ఉన్నతాధికారులకు చిన్నచూపుగా ఉంది. ప్రాథమిక వైద్య శాలల పట్ల ఇంత నిర్లక్ష్యాన్ని ఎప్పుడూ చూడలేదు. వైద్యులు లేక, మందులు లేక ఆస్పత్రి నిరుపయోగంగా మారింది. ఆస్పత్రిలో పారిశుధ్య సమస్య సైతం తీవ్రంగా ఉంది. ఈ ఆస్పత్రి నిర్వహణపై రోజుకు నాలుగైదు ఫిర్యాదులు అందుతున్నాయి. వెంటనే సిబ్బందిని నియమించి మందులు అందుబాటులో ఉంచాలి. లేదంటే వైద్య శాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తాం

- మన్నె కవితారెడ్డి, వెంకటేశ్వరనగర్‌కాలనీ కార్పొరేటర్

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

● కాంగ్రెస్ నాయకురాలు డా.కోట నీలిమ

బేగంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపునకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని.. అయితే వారి డబ్బాలు, సామాన్లను ధ్వంసం చేయొద్దని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. గత కొద్ది రోజులుగా బేగంపేటలోని ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు సమయంలో వ్యాపారుల సామాన్లు ధ్వంసం చేస్తున్నారని కోట నీలిమ దృష్టికి కాంగ్రెస్ నేత విశాల్ సుధాం తీసుకెళ్లడంతో శనివారం ఆమె ఆ ప్రాంతంలో పర్యటించారు. చిరు వ్యాపారులకు సమయం ఇవ్వకుండా బండ్లను తీసుకెళ్లి ఇవ్వడం లేదని, ట్రాఫిక్ పోలీసులు దురుసుగా వ్యవహరిస్తున్నారని వ్యాపారులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె వారితో కలిసి బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజుతో మాట్లాడారు. వ్యాపారులకు కొంత సమయం ఇచ్చి వారే డబ్బాలను తీసుకునే అవకాశం ఇవ్వాలని.. పరుషంగా మాట్లాడిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు.



చిరు వ్యాపారులతో కలిసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న కోట నీలిమ, ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు తదితరులు

హిందువులపై దాడులు హేయమైన చర్య



మాట్లాడుతున్న ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు బీఎస్‌వీ రాజశేఖర్

● బీఎస్‌వీ రాజశేఖర్

పంజాగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై అకృత్యాలను ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇండియన్ విశ్వకర్మ ఆఫీసర్స్, బిజినెస్ మెన్, ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ (ఐవీఓబీపీఎఫ్) కోరింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు బీఎస్‌వీ రాజశేఖర్ మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న అఘాయిత్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. భారతదేశం సహకారంతో స్వాతంత్ర్యం పొందిన బంగ్లాదేశ్ ఇప్పుడు మనవారిపై దాడులకు తెగబడటం హేయమైన చర్య అన్నారు. ప్రధాని మోదీ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రతి ఆలయ కమిటీలలో విశ్వకర్మలను నామినేట్ చేయాలని, కొత్తగా ప్రతిపాదించిన స్కిల్ యూనివర్సిటీకి విశ్వకర్మ స్కిల్ యూనివర్సిటీ అని పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ నాయకులు వి.జె.కుమార్, భోజరాజ, ఆర్.రజనీకాంత్, కమ్మరి వెంకటేశ్ పాల్గొన్నారు.

దేశంలో ఫాసిస్టు పాలన సాగుతోంది

● సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేత దీపాంకర్ భట్టాచార్య

పంజాగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఫాసిస్టు పాలన కొనసాగుతుందని, భారత రాజ్యాంగాన్ని మనువాద రాజ్యాంగంగా మార్చాలనే కుట్రను కొనసాగిస్తున్నారని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవంబర్ 26 నుంచి జనవరి 26 వరకు "రాజ్యాంగాన్ని రక్షించండి, రిపబ్లిక్‌ను బలోపేతం చేయండి" క్యాంపెయిన్ లో ప్రజలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1925లో మన దేశంలో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్ట్ పార్టీ బ్రిటీష్ వలస పాలకులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటాలను చేసిందన్నారు. భారత ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా బీజేపీ పాలన కొనసాగుతుందన్నారు. అదానిపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణ ఇన్‌చార్జ్ నైనాలశెట్టి మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దీపాంకర్ భట్టాచార్య

గిరిజనులు, ఆదివాసీలకు తీవ్ర అన్యాయం

● గుగులోత్ రాజేష్ నాయక్

పంజాగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనులు, ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని నంగారా భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుగులోత్ రాజేష్ నాయక్ ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 18 ప్రకారం ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధన కోసం జనవరి 30న చలో హైదరాబాద్ పేరుతో ఇందిరాపార్కు వద్ద గిరిజన గర్జన, మహాధర్నాను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, ఎస్టీల 10 శాతం రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల న్యాయ సలహాదారు పొడుగు శ్రీనాథ్, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పాయం సత్యనారాయణ, ఏజెన్సీ డీఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ సోమేష్, ప్రకాష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన గర్జన, మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుగులోత్ రాజేష్ నాయక్, శ్రీనాథ్ తదితరులు

సీఎం సహాయనిధి అందజేత



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ శనివారం పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఫజాజ్, బషీర్, లియాకత్, చోటు, అరుణ్, రాకేష్, సమద్, అహ్మద్, సురేందర్, వాజిద్, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

- యూసుఫ్‌గూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి)



సరూర్‌నగర్ సభకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అభాసుపాలు

● బీజేపీ నేత శ్యామ్‌సుందర్ గౌడ్

అమీర్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడంతో అవి అభాసుపాలు అవుతున్నాయని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్ గౌడ్ అన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సరూర్‌నగర్ బహిరంగ సభకు అమీర్‌పేట నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ గౌడ్ మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం మినహా ఏ ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ చర్యలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, కొద్ది రోజుల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగనివ్వబోరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలంగౌడ్, భిక్షపతి గౌడ్, కొత్తపల్లి రాజుగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్

ఎస్పీడీసీఎల్ సీఎండీపై ఆరోపణలు సరికాదు

● ప్రమోద్ కుమార్

పంజాగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీపై కొంత మంది పనిగట్టుకొని చేస్తున్న ఆరోపణలను సహించేది లేదని రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. శనివారం జీటీఎస్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల బదిలీల పక్రియ ముగిసిన తర్వాత ఆయన కొంత మందిని బదిలీ చేశారని, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవగాహనా రాహిత్యంతో సీఎండీని తప్పుబట్టడం తగదన్నారు. బదిలీల విషయంలో ఆయన పక్షపాతం చూపలేదన్నారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి కె.లింగం, కార్యనిర్వాహక అధ్యక్షులు కె.సోనీ, పులికోటి, మాళవిక, ఉపాధ్యక్షులు సురేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, తదితరులు

లష్కర్ జిల్లా ఏర్పాటుకు సహకరించాలి

బౌద్ధనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లష్కర్ జిల్లా ఏర్పాటుకు సహకరించాలని లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. శనివారం లష్కర్‌జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతున్న విషయాన్ని కేంద్రమంత్రికి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, లష్కర్ జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్‌యాదవ్, సభ్యులు జగదీష్‌గౌడ్, శైలేందర్, తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా నిర్మించిన షాపులను ప్రారంభిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా మార్కెట్ ఓల్డ్ జైల్‌ఖానా వద్ద కూలిపోయిన టైలరింగ్ షాపుల స్థానంలో నిర్మించిన నూతన షాపులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని అన్నారు. తాను ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించగా, మేరు సంఘం వారు కుట్టు మిషన్లు అందించి ఆదుకున్నారని అన్నారు. షాపుల నిర్మాణానికి సహకరించిన వారిని ప్రశంసించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, హరికృష్ణ, మేరు సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, వెంకటేష్, నర్సింగ్‌రావు, నరేందర్, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


నిందితుడిని చూపుతున్న ఆర్పీఎఫ్ శక్తి టీం కానిస్టేబుళ్లు

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో
18 కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ వైపు వస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 18 కిలోల గంజాయితో పాటు వ్యక్తిని సికింద్రాబాద్ డివిజనల్ ఆర్పీఎఫ్ శక్తి టీం కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి ముంబాయి వైపు వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ వ్యక్తి ఎస్-3 బోగిలో బెర్తు నంబరు 71లో ప్రయాణం చేస్తున్నాడు. ఆ సమయంలోనే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ శక్తి టీం మహిళా కానిస్టేబుళ్లు డాలీ, రాధ, జ్యోతి, శీకార్‌లు శనివారం ఉదయం ఖమ్మం-ఖాజీపేట్ మార్గ మధ్యలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ బోగిలో అనుమానంతో కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకోగా బెర్తు కింద రూ 4.40 లక్షల విలువ చేసే 18 కిలోల గంజాయిని రెండు బ్యాగుల్లో ఉన్న 9 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని హన్మకొండ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగించారు. ఈ ఏడాదిలో రూ. 4.18 కోట్ల విలువ చేసే గంజాయి సరుకును ఆర్పీఎఫ్ శక్తి టీం మహిళా కానిస్టేబుళ్ల బృందం పట్టుకుందన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


భూతపాటి ఆదామ్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవల కారణంగా పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడంలేదని భర్త రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం .. ఏదులాబాద్‌కు చెందిన భతపాటి ఆదామ్(38) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య గొడవల కారణంగా భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయి చాలా రోజులైంది. భార్యను చూసేందుకు వెళ్లి వచ్చినప్పటికి భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆదామ్ శనివారం బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ మార్గమధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుడి జేబులో దొరికిన ఫోన్ నంబరు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని రైల్వే పోలీసులు తెలిపారు.


కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న బోయిన్‌పల్లి పోలీసులు

మిస్సింగ్ కేసు ఛేదించిన బోయిన్‌పల్లి పోలీసులు

బోయిన్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి వెళ్లి కన్పించకుండా పోయిన భార్య, భర్త, ఇద్దరు చిన్నారుల మిస్సింగ్ కేసును బోయిన్‌పల్లి పోలీసులు ఛేదించారు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబోయిన్‌పల్లికి చెందిన అహ్మద్ బేగ్‌కు సనా సుల్తానతో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి 4 సంవత్సరాల బాలుడితో పాటు 9 నెలల కూతురు ఉన్నారు. సనా సుల్తాన ప్రస్తుతం ఆరు నెలల గర్భవతి. కాగా ఆమె కొన్ని రోజులుగా తన తల్లితండ్రుల ఇంటిలో ఉంటుంది. నవంబర్ 29న అహ్మద్ బేగ్ తన భార్య సుల్తానను ఇంటికి తీసుకువచ్చాడు. మరుసటిరోజు ఉదయం 5 గంటల సమయంలో వైద్యపరీక్షల కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి భార్య భర్తలు ఇద్దరు చిన్నారులతో కలిసి వెళ్లారు. ఆస్పత్రికి వెళ్లిన ఆ నలుగురు తిరిగిరాలేదు. మరుసటిరోజు కూడా తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని బోయిన్‌పల్లి పోలీసులు ఎస్‌ఐ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు మొదలు పెట్టారు. ఈ క్రమంలో వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ల ఆధారంగా ఆధునిక పరిజ్ఞానంతో ట్రేస్ చేస్తున్న సమయంలో అహ్మద్ బేగ్, సనా సుల్తానలు సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే సంబంధిత కుటుంబ సభ్యులతో అక్కడకు వెళ్లిన పోలీసు బృందం వారికి నచ్చజెప్పి బోయిన్‌పల్లి తీసుకువచ్చారు. ఈ క్రమంలో వారితోపాటు కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ చేసి వారికి అప్పగించారు.

ఆరోగ్య కేంద్రంలో అందని వైద్యం

- ఆరు నెలలుగా అందుబాటులో లేని వైద్యుడు
- ఒకే ఒక్క నర్సు పర్యవేక్షణలోనే చికిత్సలు
- మందులు సైతం అందుబాటులో లేని వైనం
- ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న పేదలు
- ఇదీ షౌకత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి



షౌకత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బంజారాహిల్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని షౌకత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు తిష్ట వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో అనారోగ్యం బారిన పడినవారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ జ్వరాలతో పాటు పలు అనారోగ్య సమస్యలతో ఈ ఆస్పత్రికి నిత్యం 50-60 మంది పేషెంట్లు వస్తుంటారు. అలాగే గర్భిణులు, చిన్నారులకు టీకాల కోసం వస్తుంటారు. గతంలో వీరందరికీ ఇక్కడ ఓ వైద్యుడు సేవలందించే వారు. అయితే ఆయన బదిలీ కావడంతో ఆరు నెలలుగా మరో వైద్యుడు అందుబాటులో లేకుండా పోయారు. డాక్టర్ పోస్టు భర్తీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మందులు సైతం అరకొరగా ఉండటంతో రోగులు అవస్థలు పడుతున్నారు.

బదిలీపై వెళ్లిన సిబ్బంది

ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం ఓ డాక్టర్, ఆరుగురు నర్సులు సేవలందించేవారు. అయితే బదీలీలపై డాక్టర్‌తో పాటు ఐదుగురు సిబ్బంది వెళ్లిపోగా కేవలం ఒక్క నర్సు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఇక్కడ సిబ్బందిని, వైద్యుడిని బదిలీ చేసిన అధికారులు తిరిగి వాటిని భర్తీ చేయడంలో నిర్లక్ష్య వైఖరి కనబరుస్తున్నారు. గతవారం బస్తీలో తల్లి, కుమారుడికి తీవ్ర జ్వరం రాగా, డెంగ్యూ అని నిర్ధారణ అయింది. అయితే ఆరోగ్య కేంద్రంలో సేవలు అందించే వారు లేకపోవడంతో సదరు రోగులు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా చికిత్స కోసం రూ.50 వేల ఖర్చు అయింది. 15 రోజుల క్రితం ఆరోగ్య కేంద్రానికి ఓ గర్భిణి చెకప్ నిమిత్తం వచ్చి స్పృహ తప్పి పడిపోయింది. ఆమెకు చికిత్స చేసేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సంజీవరెడ్డినగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జ్వరం మందులూ కరువే

కనీసం జ్వరం ట్యాబ్లెట్లు సైతం అందుబాటులో లేని దుస్థితిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. బీపీ, డయాబెటిస్ మందులు కూడా లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య తగ్గుముఖం పడుతోంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తనిఖీ చేశారు. మందులు, సిబ్బంది కొరత విషయమై ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు అప్పటికప్పుడు కొన్ని మందులు పంపించారు. ఇప్పుడు అవి అయిపోయే పరిస్థితి నెలకొంది. పరిస్థితి ఇలాగే ఉంటే ఆరోగ్య కేంద్రాన్ని మూసివేయాల్సి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతోనే..



ప్రభుత్వ ఆస్పత్రులు, పేద, మధ్యతరగతి రోగులంటే వైద్యశాఖ ఉన్నతాధికారులకు చిన్నచూపుగా ఉంది. ప్రాథమిక వైద్య శాలల పట్ల ఇంత నిర్లక్ష్యాన్ని ఎప్పుడూ చూడలేదు. వైద్యులు లేక, మందులు లేక ఆస్పత్రి నిరుపయోగంగా మారింది. ఆస్పత్రిలో పారిశుధ్య సమస్య సైతం తీవ్రంగా ఉంది. ఈ ఆస్పత్రి నిర్వహణపై రోజుకు నాలుగైదు ఫిర్యాదులు అందుతున్నాయి. వెంటనే సిబ్బందిని నియమించి మందులు అందుబాటులో ఉంచాలి. లేదంటే వైద్య శాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తాం

- మన్నె కవితారెడ్డి, వెంకటేశ్వరనగర్‌కాలనీ కార్పొరేటర్

మాలల హక్కుల కోసం పోరాటం చేయాల్సిందే

- మాలల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నక్కామధు


సమావేశంలో పాల్గొన్న నక్కా మధుతో పాటు అడ్డగుట్ట వాసులు

అడ్డగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాలల హక్కుల కోసం మాలలందరు ప్రత్యేక పోరాటం చేయాలని మాలల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నక్కామధు సూచించారు. ఈనెల 1న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన సింహాగర్జన సభ విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం తకారాంగేట్ గడ్డమీదిబస్తీలో నిర్వహించిన విజయోత్సవ ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ పరేడ్‌మైదానంలో జరిగిన సభ ద్వారా మాలల సత్తా చాటామని ఇక నుంచి మాలల హక్కుల కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలన్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్టలో త్వరలో కొత్త కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీ ద్వార ఆర్థిక పరమైన ఇబ్బందులు ఏర్పడుతూ చదువుకు దూరమై ఫీజులకు డబ్బులు లేక చాలా మంది ఉన్నారని, ఈ కమిటీ ద్వార ఆలా గాకుండా తామే స్వయంగా కాలేజీ స్కూలుకు వెళ్లి ఫీజు విషయంలో మాట్లాడి అవసరమైతే కమిటీ ద్వార ఫీజు చెల్లించేందుకు అనే అంశాలను ప్రణాళిక సిద్ధ చేస్తున్నామన్నారు. ముఖ్యంగా మాలలకు పింఛన్లు, ప్రతి నెలా బియ్యం, దుస్తులు పంపిణీ చేసే విధంగా కసరత్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేఎన్ సుధాకర్, ఆర్ మల్లేష్, మహేందర్, రమాదేవి, మనోజ్ కుమార్, చిగురు వెంకటేష్, సాయి, వసంత, రమేష్ బాబు, ప్రతాప్‌లు పాల్గొన్నారు.

కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించాలి


గిట్టుబాటు ధరలేక చెత్త కుప్పలో పడేసిన కూరగాయలు

బోయిన్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద కూరగాయల మార్కెట్ యార్డు అయిన సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని కూరగాయల మార్కెట్ యార్డులో నిత్యం పెద్ద ఎత్తున కూరగాయలు పాడైపోయి చెత్తకుప్పల్లో కనిపిస్తున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండే కాకుండా వివిధ జిల్లాల్లో రైతులు పండించిన కూరగాయలు ఈ మార్కెట్ యార్డుకే తరలిస్తుంటారు. అయితే రైతుల ద్వారా మార్కెట్ యార్డుకి వచ్చిన కూరగాయలను కమిషన్ ఏజెంట్లు కొనుగోలు చేస్తుంటారు. అయితే రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించకపోయినప్పటికీ కమిషన్ ఏజెంట్లకు అమ్ముతుంటారు. ఈ క్రమంలో కమిషన్ ఏజెంట్లు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల వ్యాపారులకు ఆ కూరగాయలను విక్రయిస్తుంటారు. అయితే కమిషన్ ఏజెంట్లకు సైతం సరైన గిట్టుబాటు ధర లభించకపోతుండడంతో కూరగాయలను చెత్తకుప్పలో వేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దేశంలోని అతిపెద్ద మార్కెట్ యార్డుగా పేరొందిన ఈ మార్కెట్ యార్డులో కూరగాయలు నిల్వ ఉంచడానికి కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతోనే పెద్ద ఎత్తున కూరగాయలు పాడైపోతున్నాయని పలువురు రైతులు, ఏజెంట్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పంటలు పండించిన కూరగాయలను చేరవేసే రైతులకు వారి వద్ద నుంచి కొనుగోలుచేసే వారికి నష్టాలు వాటిల్లుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తుకారాంగేట్ వద్ద ప్రజా పాలనలో ధూం ధాం

- మహిళలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్

అడ్డగుట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పేరుతో తెలంగాణ ప్రజల్ని మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ పీసీసీ ఉపాధ్యక్షుడు ఆదం సంతోష్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా తుకారాంగేట్ చౌరస్తాలో ప్రజా పాలనలో భాగంగా చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ప్రజల్ని మోసం చేసిన కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమయ్యాడని విమర్శించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అడ్డగుట్ట, మెట్టుగూడ, చిలకలగూడ, ఈస్ట్ మారేడుపల్లిలకు చెందిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు పంపిణీ చేయకుండానే రెవెన్యూ కార్యాలయంలోనే దాచిపెట్టారన్నారు. ఇదే విషయంపై విమర్శిస్తే ఎమ్మెల్యే పద్మారావు కొద్ది రోజుల క్రితం మారేడుపల్లి తహసీల్దార్ బీమయ్యగౌడ్‌ను బెదిరించాడన్నారు. ప్రజా పాలనలో భాగంగా సికింద్రాబాద్ నియోజక వర్గంలోని ఐదు డివిజన్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వమించి మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలేందర్ రెడ్డి, రామలీల, గంట రాజుసాగర్, ఏసిఎస్‌నగర్ హరి, సీనియర్ మహిళా నాయకురాళ్లు నర్సమ్మ, లక్ష్మి, చంద్రకళ, కొమురమ్మ, లలిత, షకీల్ ఖాన్, అడ్డగుట్ట ప్రభాకర్, ఎస్ యాదగిరి,లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ

- ప్రతిపక్షాలు రాద్ధాంతాలు చేస్తున్నాయి: కోట నీలిమ

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతాలు చేస్తున్నాయి ఏఐసీసీ సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ విమర్శించారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా సనత్‌నగర్ నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం రాంగోపాల్‌పేట్ డివిజన్ మెక్లోడ్‌గుడా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సంబరాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజాపాలన సమన్వయకర్త ఉజ్మా షకీర్‌తో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు వీధి వ్యాపారులు ఆమెను కలిసి తమ వ్యాపారాలను పోలీసులు తొలగిస్తున్నారని ఫిర్యాదు చేస్తూ, తమకు ప్రత్యామ్నాయం చేపాలని కోరారు. అనంతరం నీలిమా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పాలనను ప్రజలందరికీ చేరువగా అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. గత ప్రభుత్వాలు సంవత్సరాల తరబడి పరిపాలించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో అందించిన పాలనను అందిచలేకపోయాయన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పీఆర్‌లను పెట్టుకుని రీల్స్ చేయడం కాదు ప్రజల అభిమానాన్ని సంపాదించాలని హితవు పలికారు. ప్రజలకు ఏ భావంతో సేవ చేయాలో మాకు రేవంత్ అన్న నేర్పారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన గ్యారెంటీలను ఏ విధంగా నెరవేర్చాలో తెలుసుకోవడానికి ప్రజా పాలన కమిటీలను ఏర్పాటు చేసింది మొట్ట మొదటగా సనత్‌నగర్ నియోజకవర్గంలో అని గుర్తు చేశారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి వెళ్లే కాంగ్రెస్ వారిని డిస్టర్బ్ చేయడంలో ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ వారు విఫలమవుతున్నారన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి

మారేడుపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ ధర్మాదాయ శాఖ అధ్వర్యంలో మారేడుపల్లి సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. శనివారం ఉదయం శ్రీవల్లి దేవసాన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి క్షీరాభిషేకం, చందన పుష్పాలంకరణ, హారతి, సహస్ర నామార్చన వంటి కార్యక్రమల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కార్యక్రమంలో ఆలయ ఈఓ అరుణ కుమారి, చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, కమిటీ మెంబర్లు పి.నర్సింగరావు, ఎం.రామ్మోహన్, కే.పరమేష్, కె.పద్మజ, పి.బాలరాజ్, పి.శ్రీనివాస్, ఎక్స్అఫిషియో మెంబర్ రాజేశ్వర్ శర్మ అర్చకులు ఆనంద్, శ్రీవత్సవ, యోగేందర్ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బెయిల్ ఇవ్వొద్దు'

చిలకలగూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల ప్రత్యే క రక్షణ చట్టం 1989 కేసులల్లో నిందుతులకి బెయిల్ ఇవ్వొద్దని జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్యను శనివారం న్యూఢిల్లీలో కలిసి దళిత బహుజన ఫ్రంట్ వినతిపత్రం అందజేసారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అత్యాచార చట్టం పటిష్టంగా అమలు చేయాలని, నిందితులకి బెయిల్ ఇవ్వవద్దని, అరికట్టడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని, ఉభయ తెలుగు రాష్ట్రాలలో దాడులు పెరిగి పోతున్నాయని, ఒక సారి పర్యటించాలని కోరగా ఫిబ్రవరి నెలలో పర్యటిస్తానని హామీ ఇచ్చినట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. కార్యక్రమంలో డిబిఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వినమ్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన పాల్గొన్నారు.


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, సంస్థ ప్రతినిధులు

మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందించడం అభినందనీయమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ నవకేతన్ కాంప్లెక్స్‌లో వినూత్న ఫౌండేషన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పేద ప్రజలకు స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇచ్చి ఆర్థిక చేయూత అందించాలనేది సంస్థ ప్రధాన లక్ష్యమని వినూత్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నామని వెంకటేష్, ఉపాధ్యాక్షులు నల్లబోతుల నిత్యానంద్, జనరల్ సెక్రటరీ భైరెడ్డి నరేష్, జాయింట్ సెక్రటరీ నామని శారద తెలిపారు. ప్రథమంగా 30 మందికి 45 రోజులు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వప్న, రామకృష్ణ, ఓంకార్, కార్పొరేటర్ కొంతం దీపిక, బీజేపీ నాయకులు కొంతం నరేష్ పాల్గొన్నారు.


కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు వాహినిగనర్‌లో పవర్‌బోర్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

పవర్ బోర్ పనులు ప్రారంభం

బోయిన్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలో నెలకొన్న నీటి సమస్యను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. కంటోన్మెంట్ ఆరవ వార్డు పరిధిలోని వాహినినగర్ ప్రజల నీటి సమస్య తీర్చడానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో వేస్తున్న పవర్ బోర్ పనులను శనివారం ఆయన స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహినినగర్ కాలనీలో నీటి సమస్య ఉందని స్థానిక కాలనీవాసులు గతంలో తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో స్థానికులు దినేష్, సుజనాకుమార్, ప్రవీణ్‌జైన్, ఆనంద్, బీజేపీ నాయకులు బానుక మల్లికార్జున్, అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ క్రీడలకు ప్రత్యేక కృషి : జంపన ప్రతాప్

సికింద్రాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ న్యూ బోయిన్‌పల్లి పరిధిలోని సీనియర్ సిటిజన్స్ కోసం ఇండోర్ క్రీడాలకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ తెలిపారు. న్యూ బోయిన్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ క్యారమ్స్, చెస్ టేబుల్ టెన్నిస్ ఇతర ఇండోర్ క్రీడలు ప్రస్తుతం బోయిన్‌పల్లి మైదానంలో ఉన్న గదదిలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలివేటడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఉన్న గదితో పాటు స్థలాన్ని అధికారులు తీసుకోనున్నారన్నారు. శాశ్వతంగా సీనియర్ సిటిజన్స్ ఇండోర్ గేమ్స్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. క్యారమ్స్ ఆడే వారు కాలక్షేపం కోసం మాత్రమే ఆడాలని సూచించారు. కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్, మధు, మల్యాద్రి, శ్రీనివాస్, సిరాజ్ పాల్గొన్నారు.


జేపీ నడ్డా బహిరంగ సభకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

జేపీ నడ్డా బహిరంగ సభకు తరలిన బీజేపీ శ్రేణులు

బౌద్ధనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర పాలన వైఫల్యాలపై సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం సాయంత్రం తలపెట్టిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభకు సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, నాయకులు హన్మంతు, ఈఎల్‌ప్రతాప్ తదితరులు తరలివెళ్లారు.

ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

బౌద్ధనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు తెలిపారు. శనివారం ఆలయంలో ధనుర్మాస, వైకుంఠ ఏకాదశి ఉత్సవాల ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి జనవరి 16వ తేది వరకు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిట్ల రఘునందన్‌రావు, రాజేష్‌సింగ్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.